క్లుప్తంగా

విద్యతోనే ఉన్నత స్థాయికి..


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : పేద కుటుంబాలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గం అని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగధర్‌రావు అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మండలం కడపర్తి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, హెచ్‌ఎం ఉషారాణి, పంచాయతీ సెక్రటరీ నాగమణి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో భోజన ప్యాకెట్లు పంపిణీ


భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న శివలీల ఫౌండేషన్ సభ్యులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. దాతలు సామాజిక సేవ కార్యక్రమాలకు సహకరించాలని ఫౌండేషన్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో బైరోజు వంశీకృష్ణ, శ్రీనివాసులు, కళ్యాణి, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, శివలీల, కృష్ణమాచారి, బండమీది అంజయ్య, సులేమాన్, సైదులు, లింగారెడ్డి పాల్గొన్నారు.

సివిల్స్‌కు సన్నద్ధం కావాలి : రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి

నల్లగొండ టౌన్ : సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధం కావాలని రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ సూచించారు. శనివారం రామగిరిలోని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. తానుకూడా వసతి గృహంలో చదువుకుని ఐఏఎస్‌గా ఎంపికైన విషయాన్ని గుర్తు చేశారు. ఉన్నత లక్ష్యంతో సివిల్ సర్వీస్‌కు హాజరైతే విజయం ఖాయమన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న మల్లికార్జున్

మర్రిగూడ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిబ్బంది మల్లికార్జున్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. తాను 12 సంవత్సరాలుగా మర్రిగూడ పీహెచ్‌సీలో క్లర్క్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. గడిచిన 8 నెలల నుంచి వేతనాలు అందించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బందికి పెండిగ్ వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న కందాల ప్రమీల

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల కోరారు. నకిరేకల్‌లో శనివారం జరిగిన ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి మిగిలిన వాటిని నీరు గార్చేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. ఆ పార్టీ పట్టణ నాయకులు సాకుంట్ల నర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, నాయకులు చెన్నబోయిన నాగమణి, వంటెపాక కృష్ణ, యర్కలి అంజయ్య, బొడ్డుపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన తండు అంజయ్య ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను శనివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి రూ. 25వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, బద్దం సుధీర్, నాగరాణిఅంబేద్కర్, సిరివెన్నెల ఈదయ్య, కందిమల్ల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు అందని గ్యాస్ సబ్సిడీ

- వందల మందివి పెండింగ్‌లోనే..
- మున్సిపల్ కార్యాలయం, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- కొత్త దరఖాస్తులకు అవకాశం ఇవ్వని ప్రభుత్వం


నీలగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆరా తీస్తున్న గ్యాస్ లబ్ధిదారులు

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారంటీల్లో గ్యాస్ సబ్సిడీ పథకం ఒకటి. ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. గ్యాస్ ఏజెన్సీల వద్దనో లేక మున్సిపల్ కార్యాలయమా, లేక సాంకేతిక సమస్య అనేది తెలియదు కానీ నల్లగొండ పట్టణంలో వందల మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమ కావడం లేదు. పట్టణంలో దాదాపు 40వేల మందికి పైగా ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీల పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం గడువు పెట్టి త్వరగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయించడంతో చాలా తప్పులు దొర్లినట్లు తెలిసింది. ప్రైవేట్ ఆపరేటర్లు దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్ చేయడంతో వారు కొన్ని తప్పుగా నమోదు చేయడంలో ఇలాంటి సమస్యలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారుల వివరాలు అన్ని సవ్యంగానే ఉన్నప్పటికి కూడా కొందరికి గ్యాస్ సబ్సిడీ కింద రావల్సిన రూ. 327 ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో పలువురు లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయం, గ్యాస్ ఏజెన్సీ, బ్యాంక్‌ల వద్దకు వెళ్లి తమకు గ్యాస్ సబ్సిడీ రావడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారు. ఎంతో మంది కొత్తగా దరఖాస్తులు చేసుకోవడానికి ఎదురు చూస్తున్నా ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు.

తప్పుల సవరణ

ఇటీవల ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో మళ్లీ ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి తప్పులు ఉంటే సవరణ చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. లబ్ధిదారులు వచ్చి మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది వద్ద ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు ఉంటే సవరించుకుంటున్నారు. కరెంట్ బిల్లు, గ్యాస్ వివరాల్లో తప్పులు ఉంటే మున్సిపల్ సిబ్బంది సరి చేస్తున్నారు. కొందరివి మాత్రం వివరాలు అన్ని సవ్యంగా ఉన్నా వారికి గ్యాస్ సబ్సిడీ మాత్రం రావడం లేదు. వివరాలు అన్ని సవ్యంగా ఉన్నా గ్యాస్ సబ్సిడీ ఎందుకు పడలేదన్న విషయం మున్సిపాలిటీ వద్ద కూడా తెలియడం లేదు. పలువురు లబ్ధిదారులు తమకు ఎందుకు సబ్సిడీ పడడంలేదని మున్సిపల్ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు.

గ్యాస్ సబ్సిడీ రావడం లేదు



ప్రజాపాలన కార్యక్రమంలో రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అంటే దరఖాస్తు చేసుకున్నాము. మొత్తం డబ్బులు పెట్టి గ్యాస్ సిలిండర్‌లు కొనుగోలు చేసినా సబ్సిడీ కింద రావల్సిన డబ్బులు ఖాతాలో జమ కావడం లేదు. మున్సిపల్ కార్యాలయంలో వివరాలు అన్ని సక్రమంగానే ఉన్నట్లు చెప్పారు. – జ్యోతి, చర్లపలి

అర్హులందరికీ సబ్సిడీ ఇవ్వాలి



ప్రజాపాలనలో అన్ని వివరాలతో దరఖాస్తు నింపి అధికారులకు అందజేశాము. ఇప్పటి వరకు రెండు సార్లు గ్యాస్ బుక్ చేసినా సబ్సిడీ డబ్బులు మాత్రం రాలేదు. సబ్సిడీ కింద రూ.328 రావల్సి ఉన్నా బ్యాంక్ ఖాతాలో జమ కావడం లేదు. – సాయికిరణ్, పద్మావతి కాలనీ

పేదింటి విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి చేయూత


విద్యార్థిని భావనకు నగదు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చిట్యాల: పేదింటి విద్యార్థినికి పైచదువులకు ఆర్థిక చేయూతనందించాడు.. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిట్యాల మండలం సుంకేనేపల్లికి చెందిన యాకారి యాదయ్య కూతురు భావన ఐఐఎం(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) ఎంబీఏలో సీటు సాధించింది. ఈమె యాదాద్రి జిల్లాలోని బీబీనగర్‌లోని సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ మహిళా కాలేజీలో ఈ ఏడాది డిగ్రీ పూర్తి చేసింది. అనంతరం క్యాట్ ఎగ్జామ్ -2023లో 78.8శాతం స్కోర్ చేసి ఉత్తరఖండ్‌లోని ఖాజీపూర్, బోధగయ, జమ్ములోని మూడు ఐఐఎంలలో సీటు సాధించింది. అంతేకాకుండా ఏఎఫ్‌సీఏటీ(ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్)-2024లో సైతం ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకు ఎంపికైంది. పేదింటికి చెందిన ఆమె పైచదువుల పడుతున్న ఇబ్బందులను శనివారం నల్లగొండలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వివరించింది. వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి ఆమెకు రూ.లక్ష నగదు అందజేశారు. అంతేకాకుండా ఆమెకు భవిష్యత్తులో అన్ని రకాలుగా సహకరిస్తానని ఆయన హామీనిచ్చారు.

రోడ్డు తొలగించొద్దని రిజర్వాయర్ పనులు అడ్డగింత

మర్రిగూడ: శివన్నగూడ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న నర్సిరెడ్డిగూడెం రోడ్డును తొలగించవద్దని కోరుతూ ఆ గ్రామస్తులు శనివారం రిజర్వాయర్ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆ రోడ్డును మూసివేస్తే మరోదారి వెంట నడవడం గ్రామస్తులకు ఇబ్బందికరమని, ఇంటి స్థలంతో పాటు పునరావాసం కల్పించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాటం జంగయ్య, కీలుకత్తుల సత్తయ్య, మాదగోని హరికృష్ణ, సంజీవ, గండు రజిత పాల్గొన్నారు.


పనులు అడ్డుకుంటున్న నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖను సమీక్షించి కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలు ప్రకటించాలని, మధ్యాహ్న భోజన కార్మికులు, వీఓఏలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డబ్బికార్ మల్లేష్, ఎండీ.సలీం, ప్రమీల, దండంపల్లి సత్తయ్య, మల్లు గౌతంరెడ్డి, చింతపల్లి బయ్యన్న, ఏర్పుల యాదయ్య, కానుగు లింగస్వామి, బాణాల పరిపూర్ణచారి, తిరుపతి రామ్మూర్తి, జిట్ట నగేష్, అద్దంకి నరసింహ, గురవయ్య, గణేష్, భూలక్ష్మి, సులోచన, యాదయ్య, బక్కయ్య, నగేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్‌కు విద్యార్థుల ఎంపిక


ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం, టీచర్లు

కనగల్: ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్)కు కనగల్ మండలం చిన మాదారం ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు.పాఠశాలకు చెందిన ఆకంక్ష, శిరీష, శ్రీనిత్య, వైష్ణవి, రాహుల్, భానుప్రసాద్, రాంచరణ్, శివరాం, చందు, అఖిల్‌కుమార్ పరీక్షల్లో ప్రతిభ చూపి జాతీయ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం వల్లపట్ల పద్మ తెలిపారు. ఆ విద్యార్థులకు ప్రతి ఏడాది రూ.12వేల చొప్పున ఉపకార వేతనం అందుతుందని ఆమె తెలిపారు. ఈ ఫలితాలు సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులు పెరుమళ్ల శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయ బృందాన్ని హెచ్‌ఎం ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

చందూరు(గట్టుప్పల్) : పదోన్నతుల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ చండూరు మండలం తేరట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయడంతో పాటు గతంలో మాదిరిగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల నరసింహ, పేర్వాల రాణి, బూరుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


తేరట్‌పల్లి : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఫీజులను నియంత్రించాలి

చండూరు : ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు భూతారాజు శ్రీహరి డిమాండ్ చేశారు. శనివారం ఆయన చండూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారంగా 25శాతం పేద విద్యార్థులకు రాయితీ కల్పించాలన్నారు. గత పాలకులు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు కనీసం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించకపోవడం సిగ్గు చేటన్నారు.

గ్రంథాలయానికి నిలిచిన విద్యుత్ సరఫరా

మర్రిగూడ: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల గ్రంథాలయానికి రెండు వారాల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రంథాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ నిలిచిపోవడంతో ఫ్యాన్‌లు తిరగకపోగా దోమలు విపరీతంగా కుడుతున్నాయని పాఠకులు వాపోతున్నారు. పలుమార్లు విద్యుత్ సిబ్బందిని సంప్రదించినా ఫలితం లేదని పేర్కొంటున్నారు. విద్యుత్ కనెక్షన్‌ను సరిచేయాలని పాఠకులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- అమ్మ ఆదర్శ కమిటీలతో సర్కార్ స్కూళ్లలో మరమ్మతులు
- రూ.1.36కోట్లతో చురుగ్గా పనులు
- మెరుగైన సౌకర్యాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


చల్మెడ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఈఈ, డీఈ, ఏఈలు (ఫైల్)

మునుగోడు: ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాలల్లో ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాటికి మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అధికారులు అభివృద్ధి పనులు చేయిస్తున్నారు.

27పాఠశాలల్లో..

మునుగోడు మండలంలో మొత్తం 44 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 33 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, ఏడు ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 2,427 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. మొదటి దఫాగా ప్రభుత్వం మండలంలోని 27 పాఠశాలల అభివృద్ధికి రూ.1.36కోట్ల నిధులు మంజూరు చేసింది. అందులో 20ప్రాథమిక పాఠశాలలకు రూ. 80.20లక్షలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.28.25లక్షలు, నాలుగు ఉన్నత పాఠశాలలకు రూ.28 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయగా మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపడుతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో కొన్నేళ్లుగా కనీసం మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రధానంగా బాలికలు అనేక ఇబ్బందులు పడేవాళ్లు. ఇక నుంచి ఆ బాధలు తీరనున్నాయని సంతోష పడుతున్నారు. అంతేకాకుండా పాఠశాలల్లో మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో తమ ఇళ్ల నుంచి పుస్తకాలతో పాటు మంచి నీళ్ల బాటిళ్లు తెచ్చుకునేవాళ్లు, ఇక నుంచి అలాంటి అవసరం లేకుండా పోతుంది. వీటితో పాటు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యేవారు. మెరుగైన సౌకర్యాలు కల్పించనుండడంతో విద్యార్థులతో పాటు, వారి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైయినంత త్వరగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు.

చేపడుతున్న పనులు ఇవీ..

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రధానంగా నాలుగు పనులు చేపట్టేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

- మరుగుదొడ్ల మరమ్మతులు
- తాగు నీటి వసతి
- విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్ల బిగింపు
- పగులుబట్టిన గోడలు, పెచ్చులూడుతున్న స్లాబ్‌లకు మరమ్మతులు

పది రోజుల్లో పూర్తి చేయిస్తాం



అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మండలంలో మొత్తం 27 పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అందులో మెజార్టీ పాఠశాలల్లో ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పాఠశాలల్లో ఇటీవల పనులు ప్రారంభించాం. ప్రతి రోజు పాఠశాలలను సందర్శించి పనులు వేగవంతం చేయిస్తున్నాం. మరో పది రోజుల్లో పనులు పూర్తి చేయిస్తాం.

– పి.సతీష్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ, మునుగోడు

'నీలగిరి వేదిక' నమూనా పరిశీలన


నీలగిరి వేదిక నమునా పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్ పక్కన ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న నీలగిరి వేదిక నమూనాను శనివారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద ఆడిటోరియమని, 2వేల మంది సీటింగ్ కెపాసిటీతో నిర్మించే నీలగిరి వేదిక డిజైన్లను సంబంధిత ఏజెన్సీ ప్రతినిధి చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌కు చూపించారు. గత ప్రభుత్వ హయాంలో నీలగిరి కళాభారతి అని నామకరణం చేయగా దానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నీలగిరి వేదిక అని పేరు మార్చారు. గత డిజైన్లలో కొన్నింటికి మార్పులు, చేర్పులు చేసి తుది డిజైన్‌ను రూపొందించారు. సమావేశంలో కౌన్సిలర్లు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, గోగుల శ్రీనివాస్, నాయకులు బషీరుద్దీన్, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత


చిట్యాల: పెద్దకాపర్తిలో విద్యార్థినికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యనభ్యసించి 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆ పాఠశాల 1985–86వ బ్యాచ్ విద్యార్థులు శనివారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఫలితాల్లో 9.0 జీపీఏతో ఉత్తీర్ణత సాధించిన నీలకంఠం ఉమామహేశ్వరీ, 8.8 జీపీఏతో పాసైన ఏర్పుల వాసవీలను పూర్వ విద్యార్థులు సత్కరించి అభినందించారు. అనంతరం వారికి రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పూర్వ విద్యార్థి విద్యాసాగర్ కుమార్తె వల్లందాసు నిషిత కూడా ఇద్దరు విద్యార్థులకు రూ.5ంవేల నగదు అందజేసింది. హెచ్‌ఎం పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి జలందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నూతి సత్యశ్రీ వెంకటేశం, ముద్దసాని రమణారెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ ఆవుల మంజుల జానయ్య, మాజీ వైస్ చైర్మన్ నీలకంఠం నరేష్, పూర్వ విద్యార్థులు ఏదుళ్ల ప్రభాకర్‌రెడ్డి, పోట్లపల్లి వెంకన్న, విద్యాసాగర్, జమీల్, సువర్ణచారి, శీనారెడ్డి, పొట్ట శ్రీను, ఉపాధ్యాయులు లుకేందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, కైలాసం, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నేడు ఎరుకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మల వెంకన్న

నల్లగొండ రూరల్: ఎరుకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ నిమ్మల వెంకన్న కోరారు. శనివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించనున్న సమావేశంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన ఐదుగురు చొప్పున విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. ఎరుకల ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కమిటీ నాయకులు కృష్ణయ్య,కోకన్వీనర్లు మొగిలి విజయశేఖర్, సుల్తాన్ సోమయ్య, సుల్తాన్ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు నిమ్మచెట్టు భిక్షమయ్య, కోనేటి వెంకటయ్య, రాజబాబు, రుద్రాక్ష భిక్షం తదితరులు పాల్గొన్నారు.

'ప్రణయ గోదారి' పోస్టర్ ఆవిష్కరణ


ప్రణయ గోదారి సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మర్రిగూడ: మండలంలోని వెంకేపల్లి గ్రామానికి చెందిన పారమల్ల లింగయ్య ప్రణయ గోదారి సినిమా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సినిమా పోస్టర్‌ను సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, పందుల పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



